# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-04-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **విశాఖ పట్నంలో లార్జ్ కావిటేషన్ టన్నెల్‌కు శంకుస్థాపన చేసిన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ .**

2. **ఆంధ్రప్రదేశ్‌ను ఉద్యానవన కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

3. **కృత్రిమ మేధ సవాళ్లను ఎదుర్కోవాలంటే, శారీరక శ్రమతో కూడిన సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి.**

4. **రబీ పంట కాలంలో 23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించిన మంత్రి నాదెండ్ల మనోహర్.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ పట్నంలో నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబోరేటరీలో లార్జ్ కావిటేషన్ టన్నెల్‌కు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ, నౌకాదళ పరిశోధన, పరీక్షా సామర్థ్యాలు పెంపునకు లార్జ్ కావిటేషన్ టన్నెల్ ఉపయోగపడుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టు దేశాన్ని బలమైన నౌకాదళ శక్తిగా నిలబెడుతుందని చెప్పారు. దీని ద్వారా నౌకాదళ పరిశోధన, పరీక్షా సామర్థ్యాలు మెరుగుపడతాయని కేంద్ర రక్షణ మంత్రి వివరిస్తూ...

వాయిస్..30 సెకన్లు

--------------------------

సూక్ష్మ సేద్యం ప్రాజెక్టు ద్వారా రాబోయే రోజుల్లో వేల హెక్టార్లను సాగులోకి తేవడంతో పాటు.. ఆంధ్రప్రదేశ్‌ను ఉద్యానవన కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. 2025-26 సంవత్సరంలో సూక్ష్మ సేద్యం అమల్లో ఆంధ్రపదేశ్ దేశంలోనే ప్రథమస్థానంలో నిలవడంపై ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించి, రికార్డు స్థాయిలో 1 లక్షా 26 వేలహెక్టార్లను సూక్ష్మ సేద్యం పరిధిలోకి తీసుకువచ్చిన అధికారులను, సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. టమాటా, ఆయిల్ పామ్, మిర్చి వంటి పంటల నుంచి పప్పు ధాన్యాల వరకు వైవిధ్యమైన పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

---------------------------

కృత్రిమ మేధ ఎ. ఐ. సృష్టించే సవాళ్లను ఎదుర్కోవాలంటే, విద్యార్థులు శారీరక శ్రమతో కూడిన ఉద్యోగాలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఒక పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొని మాట్లాడుతూ...కృత్రిమ మేధను వినియోగించి చేసే అసాంఘిక చర్యలను ఎదుర్కొనడానికి ప్రత్యామ్నాయ మార్గాలపై ఆలోచనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కృత్రిమ మేధ వల్ల వైట్ కాలర్ ఉద్యోగాలు కోల్పోతే దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టమని అన్నారు. పరిస్థితులకు అనుగుణంగా విద్యా రంగంలో అనేక సంస్కరణలను తెలంగాణ ప్రభుత్వం తీసుకొస్తోందని రేవంత్ రెడ్డి వివరిస్తూ,

వాయిస్ ..25.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని నీటి ప్రాజెక్టులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. నియోజకవర్గాల వారీగా కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికతీత, వంటి పనులకు సంబందించిన అంచనాల తయారీపై ఆయన నిన్న విజయవాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి దృశ్య మాధ్యమ విధానంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిర్దేశించిన సమయం మించి పోయినా, ఇంతవరకు అంచనాలు తయారు చేయని అధికారుల తీరుపై మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. రేపు సాయంత్రంలోగా నియోజకవర్గాల వారీగా పనులకు సంబందించిన అంచనాలను పంపాలని రామానాయుడు చీఫ్ ఇంజనీర్లను ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారుల అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేయాలని రహదారులు, భవనాల శాఖమంత్రి బీసీ జనార్ధన రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఢిల్లీలో కేంద్ర రోడ్లు, రవాణా శాఖ సెక్రెటరీ ఉమాశంకర్‌ను ఆయన నిన్న కలిసి ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం జరుగుతున్న జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టుల మంజూరు, విస్తరణ పనుల అమలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో ఒక టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసామని చెప్పారు. దీనిద్వారా జాతీయ రహదారుల పనులలో భూసేకరణ, అటవీ క్లియరెన్స్, రెవెన్యూ సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తూ జాతీయ ప్రాజెక్టుల పనులు వేగంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా సహకరిస్తున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీయే ప్రభుత్వం రబీ ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సంయుక్తంగా ప్రకటించారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో నిన్న నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ...ఈ రబీలో 23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని .....రైతుల కోసం 5 కోట్లకు పైగా గోనె సంచులు, రవాణా కోసం 17 వేల 262 వాహనాలను సిద్ధం చేశామని ప్రకటించారు. ధాన్యం సేకరించిన 24 గంటల్లోనే రైతులకు నగదు చెల్లిస్తామని

నాదెండ్ల మనోహర్ పేర్కొంటూ

వాయిస్ ...30 సెకన్లు

---

తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణను సీబీఐకు అప్పగించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ఆయన నిన్న విలేకరులతో మాట్లాడుతూ.... కాళేశ్వరం ప్రాజెక్టుపై పూర్తిస్థాయి దర్యాప్తు కోరుతుంటే ....కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మేడిగడ్డపైనే మాట్లాడుతోందనన్నారు. కేరళ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో హామీల అమలుపై అసత్య ప్రచారం చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ కూడా సమర్థంగా అమలు కావడం లేదని కిషన్ రెడ్డి తెలిపారు.

---

అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీని గెలుచుకున్న తెలంగాణ పోలీసులను ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అభినందించారు. నాగ్‌పూర్‌లో జరిగిన డ్యూటీ మీట్ లో తెలంగాణ ప్రతినిధి బృందం అద్భుత ప్రదర్శన కనబర్చిందని, ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీతో పాటు యాంటీ-సాబోటేజ్ చెక్, వీడియోగ్రఫీ, కంప్యూటర్ అవగాహన వంటి విభాగాల్లో విజేతగా నిలవడం రాష్ట్రానికి గర్వకారణమని తెలిపారు.

---

ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు 73 మండలాల్లో తీవ్ర వడగాలులు, 17 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఆదివారం 32 మండలాల్లో తీవ్ర వడగాలులు, 21 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని అన్నారు. నిన్న ఆంధ్ర ప్రదేశ్ లోని పార్వతీపురం మన్యం జిల్లా భామినిలో 41.8 డిగ్రీలు, చిత్తూరు జిల్లా రాయలపేటలో 41.4. అనకాపల్లి జిల్లా నాతవరంలో 40.9, డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైందన్నారు.

తెలంగాణలో రానున్న 3 రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయని హైదరాబాద్‌లోని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంటూ పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసారు.

---

రైతులకు భూ సమస్యలు లేకుండా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం కలటూరు గ్రామంలో నిర్వహించిన “మీ భూమి- మీ హక్కు” కార్యక్రమంలో ప్రభుత్వ రాజముద్రతో ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు నిన్న పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..... భూములు రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రైతుల హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.. భూ సమస్యలను పారదర్శకంగా, వివాదాలు లేకుండా పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పార్థసారథి తెలిపారు.

---

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం ఉసులుమర్రు గ్రామంలో 36 లక్షల రూపాయల జాతీయ ఆరోగ్య మిషన్ నిధులతో నిర్మిస్తున్న గ్రామీణ ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణ పనులను ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, పనుల్లో నాణ్యతకు ఎలాంటి రాజీ లేకుండా, నిర్ణీత కాలంలో వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామని చెప్పారు. వసతి షెడ్ల సదుపాయాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని మంత్రి తెలిపారు.

======================